క్లుప్తంగా

ప్రజల మన్ననలు పొందండి



తెనాలిఅర్బన్: సచివాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి వారి మన్ననలు పొందాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులతో మంగళవారం సాయంత్రం కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధారణ బదిలీలు చేస్తున్నట్లు చెప్పారు. ఐదు సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ బదిలీ కావాలనే నిబంధన ఉండటంతో వారిని వివిధ సచివాలయాలకు పంపుతున్నట్లు చెప్పారు. అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ రీజనల్ మేనేజర్ పంపిన బదిలీ ఉత్తర్వులను ఉద్యోగులకు అందజేశారు. సమావేశంలో ఎంఈ శ్రీకాంత్, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకోవాలి

ఏవో కె.సుధీర్‌బాబు



తెనాలిటౌన్: వరి విత్తనాలను విత్తే ముందు శుద్ధి చేసి పొలంలో విత్తుకున్నట్లయితే తెగుళ్ల బారి నుంచి పంటలను రక్షించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు రైతులకు సూచించారు. మంగళవారం రూరల్ మండలం అంగలకుదురు, కోపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు పాల్గొని రైతులకు విత్తనశుద్ధి పై అవగాహన కల్పించారు. విత్తనాలను శుద్ధి చేసుకుని విత్తుకోవడం వలన అనేక రకాల తెగులు నుంచి రక్షించుకోవచ్చని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులు అర్హత కలిగి ఉండి జాబితాలో పేరులేనివారు స్థానిక రైతు సేవా కేంద్రంలో వివరాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సోనియా, వీఏఏ దీపిక, పలువురు రైతులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ



తెనాలిరూరల్: స్థానిక ఐతానగర్ కొత్తమాసు తులసీదాస్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఎన్నికల నిర్వహణ, ఎలక్షన్ ఫారాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 53 నుంచి 103 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వి.లక్ష్మీపతి రావు పాల్గొని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘం వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు సాధించాలి



నిజాంపట్నం: సస్యరక్షణ పద్ధతులను అవలంభించి సాగులో నాణ్యత విలువలతో కూడిన దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చుక్కా విజయరాజు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బావోజీపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచటం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందేందుకు ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నారు పెంచే పద్ధతులను వివరించారు. అనంతరం గ్రామంలోని సాగు భూములను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దుగ్గిరాలలో ర్యాలీ

దుగ్గిరాల:సార్వత్రిక సమ్మెలో భాగంగా దుగ్గిరాలలో బుధారం ర్యాలీ నిర్వహించనున్నారు. దుగ్గిరాలలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కార్మిక నాయకులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ నేడు ఉదయం 10 గంటలకు గ్యాస్ కంపెనీ నుంచి ప్రదర్శన ర్యాలీ మండల పరిషత్ కార్యాలయం వరకు ఉంటుందన్నారు. అమ్మిరెడ్డి, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.



మున్నంగిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్థానికులు



కఠెవరంలో నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ శివనాగేశ్వరరావు



రాజన్నకు పుష్పాంజలి ఘటిస్తున్న కొండవీటి సేవాసమితి సభ్యులు



దుప్పట్లను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నాయకులు



కొలకలూరులో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రాజన్న ఆశయాలు ముందుకు తీసుకువెళ్దాం

- సంక్షేమ పథకాలతో దేశం దృష్టిని ఆకర్షించిన డాక్టర్ వైఎస్సార్
- భవిష్యత్‌లో రాజన్న రాజ్యాన్ని తీసుకొస్తాం
- డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: వినూత్న సంక్షేమ పథకాలతో దేశం దృష్టిని ఆకర్షించిన డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలను ఆయన తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ముందుకు తీసుకెళ్లేందుకు తెనాలిలో వైఎస్సార్ సీపీ నాయకత్వం కృతనిశ్చయంతో ఉందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. భవిష్యత్‌లో జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాజన్న రాజ్యం తీసుకొస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని పట్టణంలో పార్టీ వర్గాలు ఘనంగా నిర్వహించాయి. స్థానిక రణ రంగచౌక్ దగ్గర్లోని డాక్టర్ వై.ఎస్.కాంస్య విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పుష్పాంజలి ఘటించారు. అక్కడే విలేకరులతో మాట్లాడారు. తన 5 నెలల 6 నెలల పరిపాలనతో డాక్టర్ వైఎస్, రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారని చెప్పారు. అధికారంలోకి వచ్చినవారు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి సేవ చేయాలనేది ఆచరించి చూపారని అన్నారు. తన పథకాలతో విద్య, వైద్యాన్ని పేదవర్గాలకు అందించి, వారి జీవితాల్లో పెనుమార్పులు తీసుకొచ్చారని సోదాహరణంగా చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతోపాటు అగ్రవర్ణాల్లోని పేద విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసించి ఇంజినీర్లు, డాక్టర్లుగా ఎదిగారని చెప్పారు. పేదవాడికి కార్పొరేట్ వైద్యాన్ని అందించిన ఆరోగ్యశ్రీ, ఆపత్కాలంలో వైద్యసహాయం కోసం 108 అంబులెన్స్ వంటివి డాక్టర్ వైఎస్ తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలుగా చెప్పారు. అన్నింటికీ మించి రాష్ట్ర విభజనకు డాక్టర్ వైఎస్ అంగీకరించలేదని చెబుతూ తాను బతికుండగా రాష్ట్రాన్ని ఎవరూ విడదీయలేరని చాటారని గుర్తుచేశారు. ఆయన మరణం తర్వాత రాష్ట్రనాయకులు ఏవిధంగా రాష్ట్రాన్ని విభజించిందీ తెలిసిందేనన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, రూరల్ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, మన్నవ ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, కొర్ర యశోద, పెదలంక లక్ష్మీలావణ్య, యాతాటి అనిల్, ఆవుల కోటయ్య, బచ్చనబోయిన శ్రీనివాసరావు, కుర్రా శ్రీను, మల్లెబోయిన రాము, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ రహిమా, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, తాడిబోయిన రమేష్, కాకి దేవసహాయం, బూరెల దుర్గాప్రసాద్, కఠెవరపు దేవానంద్, శానంపూడి రఘురామిరెడ్డి, చింకా సురేష్ యాదవ్, వంపుగళ్ల కృష్ణ, విస్సా డేవిడ్, పెదలంక వెంకటేశ్వర్లు, బొంతు నరేంద్రరెడ్డి, దేవరపల్లి చంద్రశేఖర రెడ్డి, డి.మల్లికార్జున రెడ్డి, చుక్కా ఆనందబాబు, మైలా విజయ్, కె.మంజీర, ఇందిర, జకీర, ఇస్రాత్, ఈద్గా గౌస్, షేక్ అన్సారీ, షేక్ సలీమ్, చుండూరు సాయి, అక్కిదాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నేతలు

కొల్లిపరలో...

కొల్లిపర: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడమే కాక వాటిని అమలు పరిచిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కిందని, అందుకే ఆయనను ఇన్ని సంవత్సరాలు గడిచినా ఈనాటికీ పేద ప్రజలు ఆయనను ఆరాధ్యదైవంగా పూజిస్తున్నారని తెనాలి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. కొల్లిపర మండల పార్టీ అధ్యక్షులు కళ్ళం వెంకటప్పారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో వెఎస్ జయంతి సందర్భంగా మున్నంగి గ్రామంలో నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పేద వయోవృద్ధులకు చీరలు, పంచలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ వేమూరి ధీనమ్మ, వేమూరి కిషోర్‌బాబు, అవుతు పోతి రెడ్డి, జిల్లా కార్యదర్శి జొన్నల శివారెడ్డి, మహిళా అధ్యక్షురాలు సుజాత, భీమవరపు శివకోటిరెడ్డి, కూరపాటి రవిశేఖర్ రెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు బి.నాంచారమ్మ పాల్గొన్నారు. శివలూరు గ్రామంలో ప్రధాన కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతు వేణుగోపాలరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

-తూములూరులో ఈమని హరికోటిరెడ్డి ఆధ్వర్యంలో యువత ప్రధాన కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఉమామహేశ్వర రెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, ఈద హర్షవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీలు అవుతు బసవపున్నారెడ్డి, మర్రెడ్డి మాధవి తదితరులు పాల్గొన్నారు.

కొండవీటి సేవాసమితి..

తెనాలి: జనరంజక ప్రజానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి రోజైన మంగళవారం కొండవీటి సేవాసమితి పాలకవర్గం రణరంగచౌక్ సమీపంలోని ఆయన విగ్రహానికి ఘననివాళి అర్పించింది. అక్కడ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని కొండవీటి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఇటీవల కాలంలో ఆ విగ్రహం ప్రదేశంలో సుందరీకరణను పూర్తిచేశారు. డాక్టర్ వై.ఎస్.జయంతి సందర్భంగా అదే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సేవాసమితి గౌరవ అధ్యక్షుడు కిక్కూరి శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు పేరం సంజీవరెడ్డి, కార్యదర్శి కామిరెడ్డి చెన్నారెడ్డి, కోశాధికారి ఉడుముల చిన్నబాలకోటిరెడ్డి, ఉపాధ్యక్షుడు వుయ్యూరి సంజీవరెడ్డి, మెట్టు శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంయుక్త కోశాధికారి దుండి శ్రీమన్నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్..

తెనాలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పట్టణానికి చెందిన శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చిన్న కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, స్వీటును పంచారు. స్థానిక రణరంగచౌక్‌కు సమీపంలోని డాక్టర్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహం ఎదుట మంగళవారం ఉదయం ఈ సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత డాక్టర్ వైఎస్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కేసరి వెంకట కృష్ణారెడ్డి, కిక్కూరి వెంకట సత్యనారాయణ, తిరుమలశెట్టి లక్ష్మారెడ్డి, దాకా అంకిరెడ్డి, న్యాయవాది విజయభాస్కర్‌రెడ్డి, శానంపూడి రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ..

పేద ప్రజల గుండెచప్పుడు డాక్టర్ వైఎస్సార్

తెనాలిటౌన్: పేద ప్రజల గుండె చప్పుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కఠెవరం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంపల శివనాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం రూరల్ మండలం కఠెవరం గ్రామంలో వైఎస్సార్ జయంతి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మర్లమ్మతల్లి సెంటర్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీశ్రేణులకు మిఠాయిలు పంపిణీ చేశారు. రైతు సంతోషంగా ఉంటే రాష్ట్రం బాగుంటుందని, అన్నదాత కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరచారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మైలా భానుప్రసాద్, తమ్మా శివారెడ్డి, సంకురు బుజ్జిబాబు, మంచాల శ్రీను, ఎస్‌కె ఆదాం షఫీ, ఆర్.శ్రీనివాసరెడ్డి, వీరయ్య, ఎల్‌బీసి చిన్ని, చిన్నబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

+ కొలకలూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీటీసీ కాలిశెట్టి ఫణీకుమార్, పినపాటి అనిల్‌కుమార్, మల్లవరపు భరత్, వీరమల్ల కార్తీకేయ, కె.దాసు, తాడిబోయిన యలమందరావు, షేక్ అజ్గర్ ఆలీ, కె.సుధ, బాషిత్ బాషా, పినపాటి రాజా, సుద్దపల్లి వీరయ్య, వీరారెడ్డి, షేక్ అజ్మల్, కాజావలి, షేక్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

+ స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పాల్గొని రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.నాగసూర్య శశిధరరావు, కె.బుల్లయ్య, పెనుగొండ శివకుమార్, భీమా రమేష్, స్టీవెన్‌బాబు, కార్తీక్, అయ్యప్ప, సుబ్బారావు, వీరాస్వామి, రాయప్ప, వెంకటేష్, మల్లిఖార్జునరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో అన్నవితరణ



అన్నవితరణ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక బాలాజీరావు పేటలోని భవిత కేంద్రంలోని చిన్నారులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బండ్లమూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న వితరణకు పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, అన్నవితరణను ప్రారంభించారు. వీరితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ మహిళా విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు. భవిత కేంద్రం పక్కనేగల పార్కు దుస్థితిని కేంద్రం యాజమాన్యం మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక దృష్టికి తీసుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే శివ కుమార్‌తో కలిసి పార్కును సందర్శించిన చైర్‌పర్సన్, పార్కు అభివృద్ధికి కౌన్సిల్ ఆమోదం తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం

- ఆప్షన్లు తీసుకుని.. పరిగణనలోకి తీసుకోని అధికారులు !
- సిఫార్సు లేఖలనూ పట్టించుకోలేదు
- బదిలీలపై ఉద్యోగుల అసంతృప్తి
- ఆరాతీస్తున్న ఓ ప్రజాప్రతినిధి కార్యాలయం

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం నెలకొంది. అయిదు సంవత్సరాలు దాటిన ప్రతి ఉద్యోగిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించటంతో ఉద్యోగుల్లో కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తెచ్చుకుని తమ ప్రయత్నాలు తాము సాగించారు. చిత్రంగా సిఫార్సు లెటర్లను తామిచ్చిన ఆప్షన్లను పరిగణనలోకి తీసుకోకుండానే పోస్టింగులు ఇచ్చారని ఉద్యోగులు వాపోతున్నారు. దీనివెనుక మున్సిపాలిటీలో పనిచేసే ఓ ఉద్యోగి చక్రం తిప్పారనే ప్రచారం జరుగుతోంది. తెనాలిలోని ఓ ప్రజాప్రతినిధి కార్యాలయ ఉద్యోగులు దీనిపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. ప్రజల వద్దకు పాలన అందించాలనే భావనతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వార్డు/గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. 2019 అక్టోబర్ 02న రాష్ట్రంలో సచివాలయాలతో ప్రజాపాలన ఆరంభమైంది. సచివాలయాల నిర్వహణను అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీకి అప్పగించటంతో పాటు ప్లానింగ్ సెక్రెటరీ, శానిటేషన్ సెక్రెటరీ, ఎడ్యుకేషన్ సెక్రెటరీ, మహిళా పోలీస్, ఎఎన్ఎం, డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ, ఎమినిటీ సెక్రెటరీ, ఎనర్జీ సెక్రెటరీ, వీఆర్‌వో వంటి ఉద్యోగులను నియమించారు. వీరందరూ సచివాలయ పరిధిలోని ప్రజలకు సేవలు అందిస్తూ వస్తున్నారు. తెనాలి పట్టణంలోని 47 సచివాలయ పరిధిలో 470 పని చేయాల్సి ఉండగా 423 మంది పనిచేస్తు వచ్చారు. వీరిలో కొందరు వివిధ కారణాల వల్ల విధులకు దూరం అయ్యారు. ఆ ఖాళీలు అలాగే ఉండిపోగా, ప్రస్తుతం 391 పనిచేస్తున్నారు. వీరిలో బదిలీలకు అర్హత ఉన్న వారు 288 మంది ఉన్నారు.



బదిలీ ఉత్తర్వులు అందుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో వేచిఉన్న ఉద్యోగులు

సిఫార్సు ఉంటే బదిలీ జరిగినట్టే..

తెనాలి నియోజకవర్గ పరిధిలో కూటమి పార్టీలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఉన్నారు. అందులో ఒకరు రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్నారు. ఎక్కువ మంది సచివాలయ ఉద్యోగులు సాధారణ ఎన్నికల్లో గెలిచిన ప్రజా ప్రతినిధి సిఫార్సు లేఖలను తెచ్చుకున్నారు. మిగిలిన వారు మండలి ఎన్నికలలో గెలిచిన ప్రజాప్రతినిధి లేఖలు తెచ్చుకున్నారు. ఇలా ఇద్దరు ప్రజాప్రతినిధుల కార్యాలయాల నుంచి లేఖలు రావటంతో అధికారులు తలలు పట్టుకున్నారు. వీటిలో దేనిని పరిగణలోకి తీసుకోవాలనే దానిపై కసరత్తు చేసి చివరకు సింహభాగం అమాత్యుని లేఖలకే ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిసింది.

బదిలీలలో గందరగోళం

అయిదు సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరినీ బదిలీ చేయాలనే నిబంధన ఉండటంతో అధికారులు ఉద్యోగుల నుంచి మూడు ఆప్షన్స్ తీసుకున్నారు. వాటిలోనే బదిలీ చేస్తామనే సంకేతం ఉద్యోగులకు ఇచ్చారు. కానీ ఇలా జరుగుతుండగా తెనాలి మున్సిపాలిటీలో పనిచేసే ఓ అధికారి చక్రం తిప్పినట్లు తెలిసింది. ఆయన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అతని వ్యవహారశైలి పలు వివాదాలకు తావిచ్చింది.

అతడే ఇప్పుడు బదిలీలలో కూడా ముఖ్యపాత్ర వహించారనే ఆరోపణ వినిపిస్తోంది. తెనాలి పట్టణ పరిధిలోని పలువురు ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వటంతో వాటిని చూసి కొందరు అవాక్కు అవ్వటంతో పాటు తాము ఇచ్చిన ఆప్షన్స్‌ను ప్రక్కన పెట్టటంపై అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఓ ప్రజాప్రతినిధి కార్యాలయం బదిలీ ఉత్తర్వుల వెనుక ఎవరున్నారనే దానిపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మొత్తం మీద తెనాలిలో జరుగుతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీలు వివాదాస్పదంగా మారాయనే చెప్పవచ్చు.

రక్తహీనతను అధిగమించేందుకు ప్రయత్నించండి

జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: రక్తహీనతను అధిగమించే విధంగా మహిళలు ప్రయత్నించాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మారీసుపేట, గంగానమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రాలను నిర్ణీత మోతాదాల్లో అందించాలని సూచించారు. ప్రసవాల మధ్య ఎక్కువ గ్యాప్ ఉండే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, డాక్టర్ వేముల ప్రియాంక, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

-డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డెంగ్యూ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కురగంటి భారతి, మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, సూదశివ గణేష్, గుద్దంటి రవి కుమార్, శ్యామ్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరుపీధుల రాంప్రసాద్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీకృష్ణ సుబ్బరాయణం

పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 23,24 వార్డులలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వల్లో ఎక్కడ వ్యర్థాలు ఉండకూడదన్నారు. కాల్వలు పారుదల జరిగే విధంగా చూడాలని తెలిపారు. ప్రతి రోజు వీటిని బాగు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆమె వెంట 24వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



గ్యాంగ్ వర్క్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ లక్ష్మీలావణ్య



రోడ్డుపై కూలిన భారీ వృక్షం

తెనాలిరూరల్: పట్టణ కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూల్ ఎదురుగా ఉన్న భారీ వృక్షం మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా నేలకూలింది. భారీ వృక్షం విరిగి రోడ్డుకు ఇరువైపులా పడడంతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కువగా ఉండటంతో పాటు హైస్కూల్ విద్యార్థులు ఈ దారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. వృక్షం విరిగిపడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు



భట్టిప్రోలు: భట్టిప్రోలులోని సాయిబాబా మందిర (ఆలయ) కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రథం సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో సాయినాథ-దత్తాత్రేయ స్వామి వార్ల గురుపౌర్ణమి వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. బుధవారం భట్టిప్రోలు, అద్దేపల్లి పురవీధులలో సాయినామ ప్రచార కార్యక్రమంలో భాగంగా భిక్షాటన, గురువారం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు, మధ్యాహ్నం గురుపౌర్ణమి సందర్భంగా నారాయణ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.